

కంకాలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న కలెక్టర్
- జనసంద్రమైన కౌటాల

6



జాతరలో పోటెత్తిన భక్తులు

క్వారీలో జంగల్ సఫారీ

- వన్యప్రాణుల సందర్శనకు ప్రత్యేక వాహనం
- సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు

7



అడవిలో ఏర్పాటు చేసిన ట్రాక్ వే

ధరణి సమస్యలకు పరిష్కారమెప్పుడు..?



- జిల్లాలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు
- నాలుగు నెలలుగా పరిష్కారానికి నోచుకోని వైనం
- ప్రజావాణి చుట్టూ తిరుగుతున్న బాధితులు

మంచిర్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ధరణి సమస్యల పరిష్కారం నానాటికీ జఠిలంగా మారుతోంది. భూ సమస్యలు పరిష్కరించాలని రైతులు రెవెన్యూ కార్యాలయాలకు, జిల్లా కేంద్రంలో కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ధరణిపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక కమిటీలను సైతం ఏర్పాటు చేసింది. ఫిబ్రవరిలో కలెక్టర్ ఆధ్వర్యంలో 18 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

మాడ్యుల్స్ వారీగా...

జిల్లా వ్యాప్తంగా ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్ కుమార్ దీపక్ ధరణి సమస్యలు పరిష్కరించాలని కసరత్తు చేస్తున్నా ఇంకా భారీ సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇప్పటికీ డేటా కరెక్షన్ చేయాల్సినవి, అర్బన్ ల్యాండ్స్, మ్యూటేషన్లు, పీవోబీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆధార్ సీడింగ్స్, గ్రీవెన్స్ భూ సమస్యలను పరిష్కరించినా కొత్త దరఖాస్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. టీఎం మాడ్యుల్స్ ఆధారంగా జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌కు ముందు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై దృష్టిసారించగా, మార్చిలో నిర్వహించిన బృందాల క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల నమోదు తర్వాత నివేదికల ఆధారంగా సమస్యలను పరిష్కరించారు. ఇవిపోను మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి మాత్రం మోక్షం లభించడం లేదు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు, తహసీల్దార్‌లు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప పెండింగ్ సమస్యలకు పరిష్కారమయ్యే అవకాశం లేదు.

పెండింగ్ దరఖాస్తులు ఇలా...

జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలలుగా దాదాపు 1,914 వరకు ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్స్‌కు సంబంధించినవి, మ్యుటేషన్‌లు, కోర్టు కేసులకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ధరణి పెండింగ్ దరఖాస్తులు మండలాల్లో తహసీల్దార్ల స్థాయిలో 774 దరఖాస్తులు...

మిగితా 7లో..

ఆర్డీవో, తహసీల్దార్లకు ప్రత్యేక అధికారాలు...

ధరణి సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో సహా ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. మండల స్థాయిలో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, లీగల్ వలంటీర్లు, కమ్యూనిటీ సర్వేయర్‌లు, పంచాయతీ కార్యదర్శులను సభ్యులుగా చేర్చి ఒక్కో మండలంలో కనీసం రెండు నుంచి మూడు కమిటీలను వేశారు. కమిటీ సభ్యులంతా మీ-సేవలు, తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. జిల్లాలో ప్రత్యేక బృందాలు పరిశీలించి ఏ రోజుకు ఆరోజు నివేదికలు కూడా అందించారు. కానీ నేటికీ కొన్నిసమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో బాధిత రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

న్యూస్ బాక్స్

పెద్దపులి దాడిలో గాయపడిన వ్యక్తికి పరామర్శ



బాధితుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఫారెస్ట్ అధికారులు

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దుబ్బగూడెంలో పెద్దపులి దాడిలో గాయపడి మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్‌ను ఫారెస్ట్ అధికారులు ఆదివారం పరామర్శించారు. సురేష్ పులి దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఏలు సింగ్ మేరు, ఎఫ్‌డీపీటీ శాంతారామ్, మంచిర్యాల ఎఫ్‌డీవో శివ్ ఆశిష్ సింగ్‌లు దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం వైద్యుడితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. వారి వెంట మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్‌వో రత్నాకర్ ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలి

నెన్నెల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై ప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సతీష్ అన్నారు. కొత్తూరులో ఆదివారం వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణులను రక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. వన్యప్రాణులను వేటా డితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కరెంటు తీగలు అమర్చి జంతువులను వేటాడే వారు తమ వ్యాపకాన్ని మానుకో వాలని సూచించారు. గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న బీజేపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

దండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా పాలన సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదమన్నారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేశారన్నారు. నిరుద్యోగ భృతి. ఇందిరమ్మ ఇండ్లు వంటి పలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. వంద రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి యేడాది గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రాజన్న, రవిగౌడ్, శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, రమణారావు, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, నాయకులు ముత్తె సత్తయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, నర్సింగ్ విద్యార్థులు

గర్మిళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీ రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు ముఖ్య కూడళ్ల మీదుగా జీజీహెచ్ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరు ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, జూనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ఆర్ఎంవో శ్రీధర్, వైద్యాధికారులు సృజన్, రమ్యశ్రీ, డెమో వెంకటేశ్వర్లు, హెచ్ఈ శ్రీనివాస్, దిశా సిబ్బంది నీలిమ, సంతోష్, ఐసీటీసీ కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందడం లేదు

బెల్లంపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని బీఆర్ ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడి కెల శ్రావణ్ అన్నారు. ఆదివారం కాసిపేట గురుకుల పాఠ శాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పప్పులో నీళ్లు ఎక్కువగా ఉన్నాయని, కూరగాయలు తాజాగా లేవని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపడం లేదని పేర్కొన్నారు. కేటీఆర్ ఆదేశాల మేరకు గురుకులాలను పరిశీలిస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం గురుకుల పాఠ శాల ఎదుట బైఠాయించారు. పోలీసులు చేరుకొని వారిని పంపించి వేశారు. శ్రీనాథ్, అరుణ్, అఖిల్, అశోక్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీసీలు సత్తాచాటాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

నస్పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తాచాటాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దాసు సురేష్ మాట్లాడుతూ అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. అన్ని బీసీ కుల సంఘాలు ఏకమై రాజ్యాధికార సాధనకు ఢిల్లీలో బహిరంగ సభకు సన్నద్ధం కావాలన్నారు. తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యంగా గెలుపునకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మాచర్ల శ్రీనివాస్, సమితి మహిళా ఉపాధ్యక్షురాలు పద్మావతి, రాష్ట్ర నాయకులు గోసిక స్వప్న, బండారి పద్మావతి, దుర్గేష్ ప్రసన్న, స్వరూప, జిల్లా ఇన్‌చార్జీ లక్ష్మన్, కన్వీనర్ మనోహర్, రంగు రాజేశం, శ్రీనివాస్, వెంకన్న, అడెపు లక్ష్మి నారాయణ, రమేష్, కోడూరి చంద్రయ్య పాల్గొన్నారు.

వంట చేసేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వంట చేసేటప్పుడు మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఏరియా చీఫ్ మేనేజర్ సుబ్బారావు అన్నారు. భారత్, ఇండేన్, హెచ్‌పీ గ్యాస్ డీలర్స్ అసోసియేషన్, ఆయిల్ కంపెనీల ఆధ్వర్యంలో టీఎన్‌జీఓస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వంటల పోటీలు నిర్వహించారు. వంట పూర్తయిన తరువాత గ్యాస్ రెగ్యులేటర్‌ను, స్టవ్‌ను తనిఖీ చేసుకోవాలని సూచించారు. న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల జిల్లా అధ్యక్షుడు తేజ్ ప్రకాష్ అగర్వాల్, రాచకొండ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు

నస్పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ఆదివారం నస్పూర్ మున్సిపాలిటీలోని 1 2, 14 వార్డుల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వేణు, కమీషనర్ సతీష్, కౌన్సిలర్లు మడిగె మల్లయ్య, ప్రకాష్ రెడ్డి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల్లో గుబులు

- రెండు రోజులుగా కమ్ముకున్న మబ్బులు
- తుఫాన్ ప్రభావంతో మారిన వాతావరణం



పంట పొలాల వద్ద వరిధాన్యంపై కప్పిన టార్పాలిన్‌లు

బెల్లంపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులతో అన్నదాతల్లో గుబులు నెలకొంది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా మబ్బులు కమ్ముకున్నాయి. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తు న్నాయి. వరి కోతలు ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.

● జిల్లాలో మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు గత నెల 17నుంచి జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 3.26లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 1950 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మిగితా ధాన్యం రైతుల కళ్లాల్లో నిల్వ ఉంది. మరికొందరు రైతులు హార్వెస్టర్‌లు, కూలీల కొరతతో ఇప్పటి వరకు వరి కోత కోయలేదు.

● వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన

బంగాళఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ కారణంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. శనివారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు వారి పంట పొలాల వద్ద నిల్వఉన్న ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పుతున్నారు. ధాన్యం తడవ కుండ ఉండేందుకు నానాతంటాలు పడుతున్నారు. పంటను కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామంటే తేమ శాతం అధికంగా ఉంటుందని ధాన్యం ఆరబెడుతున్నారు. మబ్బులు కమ్ముకొని జల్లులు పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

హాజీపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం ముల్కల్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రథమ బహుమతి శ్రీరామ్, ద్వితీయ రిష్విక, తృతీయ అభిసారికలకు బహుమతులు అందించారు. ఎంఈవో తిరుపతిరెడ్డి, నోడల్ ఆఫీసర్ హన్మాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం సందర్భంగా ఎంఆర్‌సీలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలను డీఈవో యాదయ్య పరిశీలించారు. తీగల్‌పహాడ్ విద్యార్థి బి.రిషిత్ (ప్రథమ), జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి శ్రీసస్య (ద్వితీయ), కేజీబీవి విద్యార్థి జి.హాసిని (తృతీయ) బహుమతులు సాధించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు డీఈవో బహుమతులు పంపిణీ చేశారు. ఎంఈవో దామోదర్ రావు, మండల నోడల్ అధికారి కే.రామన్న, పాల్గొన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన సంవత్సరం పూర్తయిన సందర్భంగా చెన్నూరు ఉన్నత పాఠశాలలో ఎడ్యుకేషన్ డే నిర్వహించారు. విద్యార్థులకు రీనవెబుల్ ఎనర్జీ రీసోర్సెస్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో రాధాకృష్ణమూర్తి, మేకల రామస్వామి, మహిపాల్, రమేష్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన సభకు తరలివెళ్లిన నాయకులు



లక్షెట్టిపేట నుంచి వెళ్తున్న మాల సంఘం నాయకులు

నస్పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మాలల సింహగర్జన సభకు నస్పూర్ మున్సిపాలిటీ నుంచి తరలివెళ్ళారు. సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ నుంచి మూడు బస్సులు, ఇతర వాహనాల్లో తరలివెళ్ళారు. గోసిక మనోజ్, గరిసె రామస్వామి, నర్సింగ్, రాజు, శ్రీను ఉన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభకు సంఘం నేతలు, నాయకులు తరలివెళ్లారు. మ్యాడా దయాకర్, సంతపురి రాజన్న, మాజీ సర్పంచులు మగ్గిడి శ్రీనివాస్, ఢాంకా లక్ష్మణ్, దాసరి శాంతయ్య, జంజిలి సాగర్, బండ రాకేష్, దార శ్రీనివాస్, రాపల్లి వసంత్, జీవన్, తరలివెళ్లారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): మాల సింహగర్జన సభకు చెన్నూరు నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షుడు శీలం వెంకటేశం ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ మాలలు ఐకమత్యంగా ఉండాలన్నారు. నాయకులు రాజన్న, సతీష్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ హైద్రాబాద్‌లో జరిగిన మాల సింహగర్జన సభకు మేడ సమ్మయ్య ఆధ్వర్యంలో వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిట్టల సుమన్,నస్పూరి నర్సింగం, శంకరయ్య, రాజు వెళ్లారు.


బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన మాలల సింహ గర్జన సభకు పట్టణం నుంచి మాల సంఘం నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. కో కన్వీనర్లు కుంబాల రాజేష్, కాసర్ల యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు రాజనర్సు, సత్యనారాయణ, మధు, సమ్మయ్య పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభకు మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్ ఆధ్వర్యంలో వాహనాల్లో తరలి వెళ్లారు. అశోక్, రమేష్, లచ్చయ్య, రాఘవులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేటరూరల్, (ఆంధ్రజ్యోతి): సింహగర్జన సభకు తొగరు కాంతయ్య ఆధ్వర్యంలో మాలలు తరలి వెళ్లారు. బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. బైరం లింగన్న, ప్రసాద్,నరేష్, సూరయ్య, తిరుపతి, విజయ్, సురేష్, డానియల్, రత్నయ్య,మొగిలి తదితరులు పాల్గొన్నారు.







ప్రజాపాలన ఇంటింటికీ చేరేలా
హైదరాబాద్‌లో విజయోత్సవం

- జీహెచ్‌ఎంసీలోని ముఖ్య నేతలకు పొన్నం దిశానిర్దేశం
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాన్ని నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ పరిధిలోని నేతలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ముఖ్యనేతలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం పొన్నం సమావేశమయ్యారు. ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు అమీర్‌అలీ ఖాన్, ఎంఎస్ ప్రభాకర్, 23 మంది కార్పొరేటర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. విజయోత్సవాల్లో భాగంగా 7వ తేదీన డివిజన్ స్థాయిలో మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నేతలు సమావేశం కావాలన్నారు. 8న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ట్యాంక్‌బండ్‌పై జరిగే ర్యాలీకి పెద్ద ఎత్తున జనసమీకరణ చేపట్టాలని సూచించారు. దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం కోసం పార్టీని బలోపేతం చేయాలని, ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటాలంటే కార్పొరేటర్లంతా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు.

ఎవరినీ బలవంతంగా తరలించం: సీతక్క

దోమలపెంట, శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తనవంతుగా సహకరిస్తానని మంత్రి సీతక్క తెలిపారు. పునరావాసం ఇష్టం లేనివారు అటవీ ప్రాంతంలోనే ఉండొచ్చని, వారికీ అన్ని విధాలా సహకరిస్తామని, ఎవరినీ బలవంతంగా తరలించేది లేదని స్పష్టం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని నల్లమల అటవీ ప్రాంత గ్రామాలైన వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతలబావి గ్రామాల్లో ఆమె పర్యటించారు. సీబీఎం ట్రస్టు చైర్మన్, అమ్రాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ ఆధ్వర్యంలో 400 మంది చెంచులకు దుప్పట్లు పంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీశాఖ చేపట్టనున్న పునరావాస గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇక్కడి నుంచి స్వచ్ఛందంగా మైదాన ప్రాంతాలకు వెళ్లేవారికి సహకరించాలని అధికారులకు సూచించారు. కాగా, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రికి పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదు: జూపల్లి

- పాలమూరు ప్రజలకు కేసీఆర్ మోసం: యెన్నం

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండగ సభ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలకు నిద్ర పట్టట్లేదని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలమూరు జిల్లా రైతన్నల సాగు నీటి కష్టాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీర్చలేక పోయిందని, జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సీఎం కేటాయిస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పండగ సభకు లక్షలాదిగా రైతులు తరలివచ్చి.. సీఎం రేవంత్‌ను ఆశీర్వదించారన్నారు. పాలమూరు ప్రజలను మాజీ కేసీఆర్ మోసం చేశాడని ఆరోపించారు.

లగచర్ల పారిశ్రామిక పార్కుపై సర్కారు దూకుడు!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో 182.31 ఎకరాలు సేకరించనున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంట్లో లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలున్నాయి. 2 నోటిఫికేషన్ల ద్వారా లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించనున్నారు. ఇంతకుముందు ఫార్మా విలేజ్‌లను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు తీవ్ర వివాదాస్పదమైన నేపథ్యంలో.. వాటిని ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. వాటి స్థానంలో, పారిశ్రామిక పార్కు నిర్మాణం ప్రతిపాదనను తాజాగా ముందుకు తెచ్చింది. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు, రైతుల పేర్లు, భూ విస్తీర్ణం తదితర వివరాలను నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. భూసేకరణకు సంబంధించిన అధికారిక ప్లాన్‌ను రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చూడవచ్చని తెలిపారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, బోరు వేయడం వంటి పనులు చేపట్టేందుకు తాండూరు సబ్ కలెక్టర్‌కు ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని.. అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని స్పష్టం చేశారు. భూసేకరణ, నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలు ఉంటే.. నోటిఫికేషన్ విడుదలైన 60 రోజుల్లోగా రైతులు కలెక్టర్ దృష్టికి తేవాలని పేర్కొన్నారు.

25 వేల మందికి ఉద్యోగావకాశాలు

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయటం ద్వారా దుద్యాల మండలంలోని లగచర్ల, పోలేపల్లి, హకీంపేట తదితర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెక్స్‌టైల్ వంటి పరిశ్రమలు ఏర్పాటుచేసి కనీసం 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటును ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై ప్రభుత్వం దూకుడుగానే వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. కాగా, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం.. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. భూసేకరణ ప్రక్రియ అనంతరం భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు చేపడతారు. భూములు కోల్పోనున్న వారికి నష్ట పరిహారంతోపాటు ఉపాధి, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. సాధారణంగా భూసేకరణలో నిర్వాసితులకు నష్టపరిహారం, 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం వంటివి ఇస్తుంటారు. దుద్యాల మండలంలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో భూములు కోల్పోయే రైతులకు ప్రభుత్వం ఏ విధమైన పరిహారం, పునరావాసం కల్పించనుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

నేడు కోర్టుల ముందుకు పిటిషన్లు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో వివిధ పక్షాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం కోర్టుల ముందుకు రానున్నాయి. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్‌ఎంసీలో వేసిన పిటిషన్‌పై నిర్ణయం వెలువడే అవకాశముంది. ఆయన బెయిల్ పిటిషన్ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు విచారణకు రానుంది. రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు వేసిన పిటిషన్లు కూడా జిల్లా కోర్టు ముందుకు రానున్నాయి.

విద్యలో నైపుణ్యాలకు పెద్దపీట!

ప్రపంచ అవసరాలకు పనికొచ్చేలా విద్యార్థులకు సాంకేతిక విద్య

- స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలు.. నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణలు
- పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా టీచర్ల సమస్యలను పరిష్కరించాం
- 11,062 టీచర్ పోస్టుల భర్తీ చేశాం..
- సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు.. ఒక్క ఏడాదిలోనే... ఇదో రికార్డు
- ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధనకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటోందని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. విద్యారంగంలో గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విప్లవాత్మకమైన చర్యలను చేపట్టినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచ అవసరాలను తీర్చే నైపుణ్యాలను విద్యార్థులు ఒడిసిపట్టేలా సాంకేతిక విద్యకు కొత్త మెరుగులు దిద్దుతోందని ప్రకటనలో పేర్కొంది. ఉపాధ్యాయులు పూర్తిగా బోధనపైనే దృష్టిపెట్టేలా వారి సమస్యలను పరిష్కరించినట్లు ప్రకటించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాశాఖకు రూ.21,292 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇది నిరుటి బడ్జెట్ కన్నా రూ.2,119 కోట్లు ఎక్కువ అని పేర్కొంది.. పాఠశాలల సమస్యలను పరిష్కరించడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, ఈ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలు తెరిచే నాటికి బల్లలు, కుర్చీలు, తలుపుల మరమ్మతులు.. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల విద్యుదీకరణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు జరిగిందని వెల్లడించింది. ఇందుకు రూ.1,100 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తుచేశారు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, బడుల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు.. మొక్కల సంరక్షణకు సింగరేణి కంపెనీ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.136 కోట్లు కేటాయించినట్లు సీఎంవో వివరించింది. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని, సుమారు 21,419 మందికి పదోన్నతులు లభించాయని తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా 37,406 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను, 2,757 మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను చేసినట్లు వెల్లడించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేసినట్లు పేర్కొంది. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తున్నామని, అన్ని మండలాలకు మండల విద్యాధికారులను నియమించినట్లు వెల్లడించింది. పేద పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్స్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపింది. ఆధునిక ప్రపంచ అవసరాలు, ప్రపంచంలోని పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ బిడ్డలకు నైపుణ్య విద్యను అందించాలనే సంకల్పంతో పురాతన కోర్సులు, సర్టిఫికెట్లకే పరిమితమైన 65 ఐటీఐలను రూ.2,106 కోట్ల వ్యయంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా (ఏటీసీ) మార్చినట్లు వెల్లడించింది. అకడమిక్ కోర్సులు.. పరిశ్రమల అవసరాల మధ్య అంతరాన్ని పూడ్చడానికి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించినట్లు వివరించింది. యువత ఆధునిక నైపుణ్యాలు నేర్చుకొని ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా ఈ స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పింది. పాఠశాలల్లోకి డ్రగ్స్ ప్రవేశించకుండా ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

సీఎంఆర్‌ఎఫ్ సాయం రూ.830 కోట్లు!

ముఖ్యమంత్రి సహాయనిధి అమలులో రాష్ట్ర ప్రభుత్వం కొత్త రికార్డును నెలకొల్పింది. ఏడాదిలోనే సీఎంఆర్‌ఎఫ్ కింద దాదాపు రూ.830 కోట్లను విడుదల చేసింది. దీనిద్వారా దాదాపు 1,66,000 పేద, మధ్యతరగతి కుటుంబాలు లబ్ధి పొందాయి. గత ప్రభుత్వం ఐదేళ్లలో సీఎం సహాయనిధి కింద రూ.2400 కోట్ల సాయాన్నే అందించింది. మూగ, చెవుడు సమస్యలతో జన్మించే పిల్లలకు 6 ఏళ్లలోపు శస్త్రచికిత్సలు చేయిస్తే వారికి మాటలు రావడంతో పాటు చెవులు వినపడే అవకాశముంటుంది. ఈ విషయాన్ని తొలి సమీక్షలోనే వైద్యారోగ్య శాఖ.. సీఎం దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన సీఎం ఎంత ఖర్చయినా అలాంటి పిల్లలకు చికిత్సలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 87 మంది పిల్లలకు ఎల్‌వోసీలను ప్రభుత్వం మంజూరు చేసింది.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో
రూ.8.14 కోట్ల మోసం

- బంజారాహిల్స్ బాధితుడి నుంచి కాజేసిన మోసగాళ్లు
- రాజస్థాన్‌లో ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసంలో కీలకపాత్ర వహించిన ఇద్దరిని రాజస్థాన్‌లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ట్రేడింగ్ పేరిట హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కు చెందిన ఓ బాధితుడి నుంచి ఈ ముఠా రూ.8.14 కోట్లు కాజేసింది. అయితే ఈ ముఠా సూత్రధారి శ్రవణ్ కుమార్‌ను ఇటీవలే అరెస్టు చేశామని, అతనికి పలు బ్యాంకులకు సంబంధించిన కరెంట్ అకౌంట్ ఖాతాలు ఇచ్చి వాటిలోకి వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు మళ్లించడంలో కీలకపాత్ర పోషించిన ఉదయ్‌పూర్‌కు చెందిన రాహుల్ డాంగీ, రాహుల్ బోయ్‌ను అరెస్టు చేసినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ తెలిపారు. వీరిద్దరినీ ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు చెప్పారు. రాహుల్ డాంగీ.. శ్రీ సన్వారియా ఫర్నీచర్స్ పేరిట కరెంట్ అకౌంట్ ఖాతాను నిర్వహిస్తున్నాడని, ఇందులోకి ట్రేడింగ్ ద్వారా తాము టార్గెట్ చేసిన వ్యక్తుల నుంచి డబ్బు టాన్స్‌ఫర్ చేస్తారని, బంజారాహిల్స్ బాధితుడికి సంబంధించిన రూ.75లక్షలు ఈ ఖాతాకు బదిలీ అయినట్టు షికా గోయల్ చెప్పారు. వెంటనే రాహుల్ ఆ డబ్బును 25 ఖాతాలకు మళ్లించినట్టు తెలిపారు. అలాగే రాహుల్ బోయ్ 5 ఖాతాలను నిందితులకు ఇచ్చాడని, వీటిలోని రెండు ఖాతాలకు బంజారాహిల్స్ బాధితుడి నుంచి మిగతా డబ్బు బదిలీ అయినట్టు చెప్పారు. మోసగాళ్లు వాట్సాప్ ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా ట్రేడింగ్ టిప్స్ ఇచ్చి ముందు డబ్బు వచ్చేలా చేస్తారని, తర్వాత తాము అనుకున్న మొత్తాన్ని కొట్టేసి ఫోన్లు స్విచాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షికా గోయల్ సూచించారు.

క్రైం కార్నర్

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

వాంకిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి విఫలయత్నం చేశారు. లారీలో వచ్చిన ఇద్దరు ముఖానికి ముసుగు ధరించి ఏటీఎంలోకి చొరబడ్డారు. ఏటీఎం మిషన్‌ను ఇనుపరాడ్‌తో పగలగొట్టగా అలారం ఆక్టివేట్ కావడంతో అక్కడి నుంచి పారిపోయారు. వాంకిడి పోలీసు పెట్రోలింగ్ వాహనం అక్కడికి చేరుకొని బయట అమర్చిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి నందిగామకు ఎందిన బండ్ల అబ్రహ్మం, విజయవాడకు చెందిన తుమ్మల మధుగా గుర్తించారు. సమాచారాన్ని మంచిర్యాల పోలీసులకు తెలుపగా వారు పట్టుకొని కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న లక్క పట్టివేత

వేమనపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రిజర్వుఫారెస్టు నుంచి అక్రమంగా తరలిస్తున్న లక్కను ఆదివారం కల్లెంపల్లి సమీపంలో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. కుష్నపల్లి ఎఫ్‌ఆర్‌వో దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం దహెగాం మండలం మొట్లగూడెం, రాంపూర్ అటవీ ప్రాంతాల్లో తీగ మోదుగచెట్లను నరికి లక్కను సేకరించారన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం చెందిన జెన్న వెంకటేశ్వర్లు, పవనూరి సత్యనారాయణ, దుర్గంసత్యనారాయణ, చెన్నూరుకు చెందిన దిండు చిరంజీవి, దహెగాం మండలం రాంపూర్‌చెందిన చెడ్మెక సుధాకర్, కోటపల్లికి చెందిన ఏలేశ్వరం మహేష్ బొలేరోవాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నామని, రాంపూర్‌చెందిన చెడ్మెకసుధాకర్ పారిపోయినట్లు తెలిపారు. నిందితుల వద్దనుంచి వందకిలోల లక్క, వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. లక్క బంగారు ఆభరణాలను తయారీకి ఉపయోగిస్తారని తెలిపారు. డిప్యూటీ ఆర్‌వో రూపేష్, ఎఫ్‌ఎస్‌వో బేగ్, బీట్ ఆఫీసర్ సాఫియా బేగం, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

మినీ వ్యాన్ ఢీకొని రైతు మృతి

జైనూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాసిమెట్టలో శనివారం రాత్రి రోడ్డు పక్కన ఎద్దులను కట్టి వేస్తుండగా మేస్రాం జైవంత్‌రావ్‌ను కెర మెరి వైపు నుంచి వస్తున్న మినీవ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో జైవంత్‌రావ్(47) తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. డ్రైవర్ వాహనం ఆపకుండా జైనూరు వైపు వెళ్తుండగా గ్రామస్థులు వెంబడించి పట్టుకున్నారు. మృతుడి కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాండూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన వరాల అనిల్‌కుమార్ (26) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కలపను తరలిస్తున్న వ్యాన్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

మందమర్రిరూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కలపను తరలిస్తున్నారనే నెపంతో ఆదివారం మామిడిగట్టు గ్రామస్థులు డీసీఎంవ్యాన్‌ను అడ్డుకున్నారు. గతంలో అవడంలో పనిచేసిన ఓఫారెస్టుఅధికారి ఆదివారం వ్యాన్‌లో కలపను క్యాతనపల్లికి తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తూ అడ్డుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు

నెన్నెల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోనంపేట ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మహిళాటీచర్‌పై సోషల్‌మీడియాలో అసత్య ప్రచారం చేసిన శ్రీనివాస్ అనే వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్టులు పెట్టినట్టు బాధిత టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

మందమర్రిలో ఆపరేషన్ చబుత్ర

మందమర్రి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆపరేషన్ చబుత్ర నిర్వహించారు. 35మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరివద్దనుంచి 15బైకులు, కారుస్వాధీనం చేసుకున్నారు.

కంకాలమ్మ జాతరకు
పోటెత్తిన భక్తజనం

- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు
- అలరించిన నృత్యాలు, శివసత్తుల పూనకాలు
- దర్శించుకున్న కలెక్టర్
- జనసంద్రమైన కౌటాల



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతరలో పోటెత్తిన భక్తజనం

కౌటాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై ఆదివారం నిర్వహించిన జాతరకు భక్తజనం పోటెత్తారు. ఎటుచూసినా భక్తులు అమ్మవారి దర్శనంకోసం గుట్టవైపే చేరుకోవడం కనిపించింది. ఎంతో పురాతనమైన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో 20సంవత్సరాలుగా మహాజాతర నిర్వ హిస్తున్నారు. అమ్మ వారికి దీపారాధనతో మొదలైన జాతర ప్రముఖులు, స్వామీలతో పోటెత్తింది. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనయ్య కళ్యాణి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వరకు 30వేల మంది దర్శించుకోగా పెద్ద సంఖ్యలో క్యూలో భక్తులు బారులు తీరిఉన్నారు.

వేలసంఖ్యలో తరలివచ్చిన భక్తులు..

తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో జాతరకు తరలివచ్చారు. భక్తులు గుట్టలపై అమ్మవారికి నైవేద్యం వండి సమర్పించారు. ముఖ్యంగా 12సంవత్సరాల క్రితం అమ్మవారిని దర్శించు కున్న చక్రధర్ అనే వ్యక్తి కుటుంబంతో సహా అమెరికాలో స్థిరపడ్డారు. ఈసారి అమ్మవారి దర్శణానికి కుటుంబ సమేతంగా అమెరికా నుంచి వచ్చి నాలుగు రోజులుగా పూజల్లో పాల్గొనడం విశేషం.

అలరించిన శివసత్తుల పూనకాలు..

జాతర శివసత్తులు పూనకాలు, పట్నాలతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. గుట్టపైకి వచ్చే ప్రముఖులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

దర్శించుకున్న కలెక్టర్ దంపతులు..

జాతర సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సతీ సమేతంగా కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు కలెక్టర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకన్నారు.

భక్తులకు అన్నదానం..

వేల సంఖ్యలో వచ్చిన భక్తుల కొరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లుచేశారు. సేద తీరేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. జాతరలో చిన్నపిల్లల కోసం రంగుల రాట్నం తదితర వాటిని ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల ఆట వస్తువులు, వెదురుతో తయారు చేసిన వస్తువుల దుకాణాలు ఏర్పాటు చేశారు.

గట్టిబందో బస్తు..

జాతరకు పోలీసుశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్, సీఐ రమేష్‌తో పాటు ఎస్సైలు మధుకర్, కమలాకర్, రమేష్, రాజు, ప్రవీణ్‌తోపాటు 200 మంది పోలీసులు భారీ బందోబస్తులో పాల్గొన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పార్కింగ్, బారికేడ్లు ఏర్పాటు చేశారు.



బారులు తీరిన భక్తులు



కుటుంబ సమేతంగా వచ్చిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే

దుప్పిని రక్షించిన అటవీసిబ్బంది



అటవీ ప్రాంతంలో వదిలిపెట్టిన దుప్పి

వాంకిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవాంకిడి గ్రామంలో ఆదివారం కుమరంభీంప్రాజెక్టు ప్రధాన కాలువలో దాహార్తిని తీర్చుకునేందుకు వెళ్లి దుప్పి అందులో పడిపోయింది. స్థానికులు గమనించి అటవీఅధికారులకు సమాచారం ఇవ్వడంతో డిప్యూటీ రేంజ్ అధికారి ఝాన్సీలక్ష్మీ, బీట్ అధికారి శ్రీనివాస్ తాళ్లసహాయంతో దుప్పిని బయటకుతీసి సమీపఅటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

అడవికి నిప్పు వన్యప్రాణులకు ముప్పు

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణాలకు ముప్పు కలుగుతుందని వావుదాం బీట్ అధికారి అమరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని గంటలగూడెం, కాప్రి, బనారుగొంది గ్రామాలకు ప్రజలకు అడవికి నిప్పు పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై అవగాహన కల్పించి పోస్టర్‌విడుదల చేశారు. కార్యక్రమంలో పటేల్ కీర్తనరావు,రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణకార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపేందర్ డిమాండ్‌చేశారు. ఆదివారం తిర్యాణి మండలంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణకార్మికులకు ఇందిరమ్మఇల్లు, సంక్షేమ బోర్డు, సలహాబోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని, పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జంగు, మొగిలి, దేవేందర్, వెంకటేశంచారి, సత్తయ్య, హరీష్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

కెరమెరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పలు ఉన్నతపాఠశాలల్లో పునరుత్పాదకశక్తి వనరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆడెప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన జయశ్రీ, రాజేష్‌బద్రు, పవిత్రకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్,నర్సయ్య, సురేష్, నందిని, యోగేష్, వినిత్, శివ, రాజేశ్వరి పాల్గొన్నారు.

క్వారీలో జంగల్ సఫారీ

● వన్యప్రాణుల సందర్శనకు ప్రత్యేక వాహనం ● సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రాలు

మంచిర్యాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చుట్టూ ఎత్తయిన కొండలు.. దట్టమైన అటవీ ప్రాంతం... పచ్చని చెట్లు.. ఆహ్లాదం కలిగించే నీటి కొలనులు... మంచిర్యాల జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న ఈ ప్రకృతి అందాలను వీక్షించే అవకాశం పర్యావరణ ప్రేమికులకు కలగనుంది. ఇందుకు ఎంసీసీ (మంచిర్యాల సిమెంట్ కంపనీ) క్వారీలోని కవ్వాల్ అభయారణ్యం 'జంగల్‌సఫారీ'కి వేదిక కానుంది. హాజీపూర్ మండలం గడ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో జంగల్ సఫారీ ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. అటవీశాఖ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుండగా త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కొనసాగుతున్న పనులు...

కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులోని లక్షెట్టిపేట రేంజ్, పాత మంచిర్యాల బీట్ పరిధిలో సఫారీ పనులు సాగుతున్నాయి. క్వారీనుంచి మందమర్రి మండలం గంధారి ఖిలా వరకు సుమారు 20కిలోమీటర్ల మేర పర్యటన సాగ నుండగా, రూ. 25లక్షల వ్యయంతో సఫారీ ట్రాక్ ఏర్పాటు చేశారు. 'జంగల్ సఫారీ'లో భాగంగా పర్యాటకులు అడవి అందాలు, వన్యప్రాణులను వీక్షించేందుకు ఆరుచోట్ల మంచెలు ఏర్పాటు చేశారు. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఐదు నీటి కుంటలు ఏర్పాటు చేసి వాటిలో నీరు నింపేందుకు సోలార్ సబ్ మెర్సిబుల్ పంప్ సెట్‌తో కూడిన బోర్ వేయించారు. సఫారీ వాహనంలో ప్రయాణిస్తూ రకరకాల వన్యప్రాణులను వీక్షించే అవకాశం పర్యాటకులకు కలుగనుంది. శాఖాహార జంతువుల ఆహారం కోసం గడ్డి క్షేత్రాలను పెంచారు. అడవి అందాలు, వన్యప్రాణులతోపాటు గాంధారీ ఖిల్లాను సందర్శించే ఏర్పాట్లు చేస్తున్నారు. క్వారీకి వెళ్లే మార్గంలో ఎత్తయిన గుట్టల మధ్య నుంచి ఏర్పాటు చేసిన ఘాట్ రోడ్డు, మూల మలుపులు, పచ్చని చెట్లు అలరిస్తాయి. ఇటీవల సఫారీ ఏర్పాట్లలో భాగంగా రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ కెమెరాకు అడవిలోకి వెళ్తున్న పులి చిక్కింది. కెమెరాకు చిక్కిన పులి చిత్రాలను అటవీ అధికారులు విడుదల చేశారు. గతంలో ఎంసీసీ యాజమాన్యం గుట్టలపై ఉన్న చెట్లలో పార్కుల నిర్మాణం చేపట్టి పిక్నిక్ సాట్‌గా మార్చింది. సెలవు రోజుల్లో యువత క్వారీ అడవులకు వస్తారు. ఇప్పుడు జంగల్ సఫారీ కూడా అందుబాటులోకి వస్తుండటంతో క్వారీ అడవులు పర్యాటకులతో సందడిగా మారనున్నాయి.



సఫారీ ట్రయల్ రన్ చేస్తున్న అటవీ అధికారులు



రాత్రి బస చేసేందుకు అడవిలో ఏర్పాటు చేసిన మంచె

రాత్రి బస చేసేందుకూ ఏర్పాట్లు...

వివిధ ప్రాంతాల నుంచి అడవుల అందాలను ఆస్వాదిస్తూ రాత్రిళ్లు బస చేయాలనుకునే పర్యాటకుల కూ జంగల్ సఫారీలో ఏర్పాట్లు చేస్తున్నారు. అడవుల్లో ట్రాక్ పొడవునా ఏర్పాటు చేస్తున్న ఎత్తైన మంచెలను పర్యాటకుల బసకు వినియోగించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను మంచెల్లో చేస్తున్నారు. అలాగే జంగల్ సఫారికి ఒక్కో టిప్పునకు రూ.3వేల వరకు వసూలు చేయనున్నారు. ఒక్కో సఫారీ వాహనంలో ఆరుగురు వ్యక్తులు ప్రయాణించేందుకు వెసులుబాటు కల్పిస్తున్నారు. ఆరుగురు వ్యక్తులకు తలా రూ. 500 చొప్పున వసూలు చేసే ఆలోచనలో అటవీశాఖ అధికారులు ఉన్నారు. ఇప్పటికే జిల్లాలోని జన్నారం కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీ అందుబాటులో ఉండగా, అక్కడ ఒక్కో ట్రిప్పునకు రూ.3,500 చొప్పున వసూలు చేస్తున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..



జంగల్ సఫారీని త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈనెల 4న పెద్దపల్లి జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ కృషి చేస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే సీఎం చేతుల మీదుగానే ప్రారంభం కానుంది. ఇక్కడ ట్రెకింగ్ ఏర్పాట్లు కూడా చేస్తుండగా, పర్యావరణ ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

- అత్తె సుభాష్, లక్షెట్టిపేట అటవీ రేంజ్ అధికారి

ధరణి సమస్యలకు పరిష్కారమెప్పుడు..?

5వ పేజీ తరువాయి..

పెండింగ్‌లో ఉండగా, ఆర్డీవోల లాగిన్‌లో 636, అడిషనల్ కలెక్టర్ వద్ద 448, కలెక్టర్ లాగిన్‌లో 56 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

కులగణన సర్వేతోనూ ఆటంకం...

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బీసీ సమగ్ర కుల గణన సర్వే కారణంగానూ ధరణి దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ సహా ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, ఇతర ఉద్యోగులు దాదాపు 15రోజులపాటు సర్వే పనుల్లో తలమునకలై ఉన్నారు. దీంతో ధరణి దరఖాస్తుల వైపు పూర్తిస్థాయిలో దృష్టి సారించే అవకాశం లేకుండా పోయింది.

అయ్యప్ప ఆలయంలో అన్నదానానికి విరాళం



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు

మందమర్రి టౌన్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానానికి రూ. 60 వేల విరాళాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఆదివారం విరాళంగా అందజేశారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి సహకరించామని, 12 సంవత్సరాలుగా నిత్యాన్నదానానికి ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

● అయ్యప్ప స్వామి ఆలయంలో పని చేస్తూ అనారోగ్యం బారిన పడిన బానమ్మకు అయ్యప్ప స్వాములు సేకరించిన రూ.1 లక్షా 19 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కుటుంబ సభ్యులకు అందజేశారు. సదానందం గురుస్వామి మాట్లాడుతూ బానమ్మ ఇటీవల అనారోగ్యం బారిన పడిందని, విరాళం సేకరించి అందజేసినట్లు తెలిపారు. గుడ్ల రమేష్, సొత్కు సుదర్శన్, నేముల ఉపేందర్ గౌడ్, బత్తుల శ్రీనివాస్, నరేష్, స్వాములు పాల్గొన్నారు.

మీసేవ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న మీసేవ సభ్యులు

గర్మిళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల చున్నంబట్టివాడ లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు భైరా శంకర్, ప్రధాన కార్యదర్శి మోహిద్ హాజరై జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అంకం వాసు, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ చంద్రశేఖర్, జిల్లా మీడియా కన్వీనర్‌గా సతీష్‌లను ఎన్నుకున్నారు.

జిల్లా మహిళా ఆర్గనైజర్‌గా శిరీష

జన్నారం, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో జరిగిన మీ సేవ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా మీ సేవ ఆర్గనైజర్‌గా రేండ్లగూడ గ్రామ మీ సేవ నిర్వాహకురాలు గోనె శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా మనోజ్‌కుమార్, తిరుపతిలు ఎన్నికయ్యారు.

న్యూస్ బాక్స్

ఉచిత వైద్య శిబిరం

హాజీపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి గ్రామంలో మంచిర్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ క్యాంపు ప్రోగ్రాం చైర్మన్, మాజీ ఎంపీటీసీ డేగ బాపు ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ చంద్రదత్, సర్జన్ డాక్టర్ సురేష్‌కుమార్, న్యూరో డాక్టర్ నిశాంత్‌లు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. లయన్ బాలమోహన్, రామాంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన వారోత్సవాల కోఆర్డినేటర్‌గా సత్యనారాయణ



మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా వారోత్సవాల బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, జిల్లా నాయకుడు చిట్ల సత్యనారాయణను నియమించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు వెలువరించారు.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గట్రావుపల్లి గ్రామంలో ఆదివారం మంద ఐలయ్య ఆధ్వర్యంలో గిరిజనులకు వంద దుప్పట్లు పంపిణీ చేశారు. ఐలయ్య మాట్లాడుతూ చలి తీవ్రత నేపథ్యంలో కూతురు పుట్టిన రోజును పురస్కరించుకుని దుప్పట్లు అందజేసినట్లు తెలిపారు. మాజీ కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్, మేరుగు శంకర్, పెంద్రం రాజు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాజాతా

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ యాప, కోమటిచేను గ్రామాల్లో కళాకారులు కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కళాజాతా టీం లీడర్ లావుడ్య రమేష్, కళాకారులు లచ్చన్న, కృష్ణ, రాజ తిరుపతి, కృష్ణ, నాగలక్ష్మీ, సంతోష్ పాల్గొన్నారు.

సర్వే డాటా ఎంట్రీ వేగవంతం చేయాలి

జైపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటా ఎంట్రీని వేగవంతం చేయాలని ఎంపీవో శ్రీపతి బాపురావు పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీవో, తహసీల్దార్, ఐకేపీ కార్యాలయాల్లో జరుగుతున్న డాటా ఎంట్రీని పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు డాటా ఎంట్రీ పూర్తయ్యేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

దండేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ ఎంపిక పోటీలు ఆదివారం ముగిసాయి. పోటీలో రాష్ట్రంలో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా, తృతీయ మెదక్ ఉమ్మడి జిల్లా జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలో నిజామాబాద్ జిల్లా ప్రథమ, ద్వితీయ ఖమ్మం, తృతీయ రంగారెడ్డి జిల్లా జట్లు విజేతలుగా నిలిచారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మైలారపు శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు, మాజీ జడ్పీటీసీ నాగరాణిత్రిమూర్తి, పోటీల నిర్వాహకులు ఎండి ఖాజా, ఎన్ గోవర్ధన్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, బహుమతులు అందజేశారు. జిల్లా వ్యాయమ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సిరంగి గోపాల్, రమేష్, ప్రేమ్‌కుమార్, మనోహర్, యాకుబ్, రవి, చాంద్ పాషా, సుదర్శన్, సాంబమూర్తి, వరలక్ష్మి, పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మైలారం జట్టు



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఏసీపీ రవికుమార్

కన్నెపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బెన గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతగా మైలారం జట్టు గెలుపొందింది. విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్ రెబ్బెన జట్టుకు రూ.10 వేలను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఏసీపీ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐ గంగారాం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లా విద్యార్థులు రాణించాలి



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్, ద్వితీయ బహుమతి అందుకుంటున్న విష్ణుప్రియ, రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి ఇంద్రవర్మ

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లా విద్యార్థులు రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్రినిటీ హై స్కూల్‌లో విజ్ఞాన శాస్త్ర మేళా ఆదివారం ముగిసింది. విజేతలుగా నిలిచిన వారికి అదనపు కలెక్టర్ బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకువచ్చారన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు వేదికలుగా దోహదపడుతాయన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో ఆసక్తితో పాల్గొన్నార న్నారు. ఇన్‌స్పైర్ విజేతలు 15 మంది, ఆర్‌బీవీపీ విజేతలు సీనియర్ విభాగంలో 14 మంది, జూనియర్ విభాగంలో 14 మందికి, టీఎల్ఎం విభా గంలో ఇద్దరు, సెమినార్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. న్యాయ నిర్ణేతలు శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి మధు బాబు మాట్లాడుతూ విద్యార్థుల ప్రాజెక్టులు వినూత్నంగా ఉన్నాయని ప్రశంసించారు. ఎంపికైన విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని కోరారు. న్యాయనిర్ణేతలు అదనపు కలెక్టర్ మోతిలాల్, థామస్‌లను సన్మానించారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ఎంజేపీ విద్యార్థి

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ మనాక్ ఎగ్జిబిషన్ పోటీల్లో మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకులానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఉగ్గె ఇంద్రవర్మ రూపొందించిన మెట్రో అంబులెన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైందని ఎంజేపీ గుడిపేట ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. సైన్స్ టీచర్లు రోనాల్డ్ కిరణ్, శ్రీనివాస్‌లను అభి నందించారు. విద్యార్థిని ఎంఈవో తిరుపతిరెడ్డి, నోడల్ అధికారి హన్మాండ్లు అభినందించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ

లక్షెట్టిపేటరూరల్, (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.విష్ణుప్రియ ద్వితీయ బహుమతి సాధించింది. డీఈవో యాదయ్య చేతుల మీదుగా ప్రశంసా పత్రం, మెమొంటో అందుకున్నట్లు హెచ్ఎం యశోధర తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీఉషోదయ స్కూల్‌లో నిర్వహిస్తున్న 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ సబ్ జూనియర్ పోటీలను ఆదివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఎగురవేసిన ఆమె గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అనేక చర్యలు చేపడుతుందన్నారు. మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు సాయికుంటలోని 11 ఎకరాల్లో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియం ఏర్పాటు, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్, స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కృషి చేశారన్నారు. జిల్లా డీవైఎస్‌వో కె.రాజ్‌వీరు, రాష్ట్ర, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాసిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట జిల్లా పరిషత్ పాఠశాల 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను, తీపి గుర్తులను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

బెల్లంపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు బాధ్యతగా విదులు నిర్వర్తించాలని ఏసీపీ రవికుమార్ అన్నారు. ఆదివారం రూరల్ సీఐ కార్యాలయంలో విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు సూచనలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వ హించాలన్నారు. ప్రజల రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతూ ప్రజల మన్ననలను పొందాల న్నారు. సీఐలు అఫ్జలుద్దీన్,దేవయ్య, ఎస్ఐలు మహేందర్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): పోలీసులు నిజాయితీగా విధులు నిర్వహిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఏసీపీ రవికుమార్ సూచించారు. ఆదివారం తాండూర్ సర్కిల్ కార్యాలయంలో విధుల్లో చేరిన పోలీసులకు సూచనలు చేశారు. వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని, బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. సీఐ కుమారస్వామి, మాదారం, భీమిని, కన్నెపల్లి ఎస్ఐలు సౌజన్య, విజయ్, గంగారాం, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారం మండలాన్ని నేర రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న పోలీసులు పున్నం సంపూర్ణ, చంద్రమౌళిలను అభినందించారు. ఎస్ఐ శ్వేత, పోలీసులు పాల్గొన్నారు.



సాగునీరు పారేదెలా?



కాగజ్‌నగర్ వేంపల్లి వద్ద నిర్మాణ దశలో ఉన్న ఎడమ కాలువ

- అసంపూర్తిగా కుమరంభీం ప్రాజెక్టు ఎడమ కాల్వ
- నిధులిస్తేనే పూర్తయ్యే అవకాశాలు
- ప్రాజెక్టులో నీరున్నా నిరుపయోగం
- వర్షాధార పంటలే దిక్కు

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ప్రాజెక్టు ఎడమ కాలువ కింద ఉన్న రైతులు సాగు నీరుకు నోచుకోవడం లేదు. జిల్లాలో 45వేల ఎకరాల సాగునీరందించే లక్ష్యంతో కుమరంభీం ప్రాజెక్టును నిర్మించారు. 2011లో ఎడమ కాల్వ పనులను ప్రారంభించారు. ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లోని వివిధ గ్రామాలకు నీరందించడం ఈ కాలువ నిర్మాణ ప్రధాన లక్ష్యం. అయితే ఈ కాలువ నిర్మాణ పనులు నేటికీ పూర్తికాలేదు. ఇందుకు నిధులు విడుదల కాకపోడమే ప్రధాన సమస్య. ఒక్క ఎడమ కాల్వద్వారా సిర్పూరు నియోజకవర్గంలోని సిర్పూరు(టి), కాగజ్‌నగర్, కౌటాల తదితర మండలాలకు 65కిలోమీటర్ల మేర కాల్వ తవ్వకాలు చేపట్టారు. నిధులు కేటాయించక పోవటం, అటవీశాఖ నుంచి క్లియరెన్స్ లేకపోవడం, భూ సమస్య వెరసి కాలువ అసంపూర్తి దశను వీడటం లేదు. ప్రధాన కాల్వ పనులు పూర్తిస్థాయిలో అయినప్పటికీ పిల్లకాల్వ నిర్మాణాలు ఇంతవరకు పూర్తి కాలేదు. 2019లో ఆర్థిక బడ్జెట్‌లో కేవలం రూ.10కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో కొంతమేర నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇంకా నిధుల అవసరం ఉంది. ఎడమ కాల్వ పూర్తి చేయా లంటే రూ.80కోట్ల మేర నిధులు అవసరం ఉందని అధికారులు అంచనాలు వేశారు. ఈ నిధులు విడుదల అయితే తప్పా కాలువ పూర్తికాని పరిస్థితి నెల కొంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కాల్వ దుస్థితిపై నివేదికలను తెప్పించుకుంది. ఎని మిది నెలల క్రితం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఎడమ కాల్వను పరిశీలించి ప్రభు త్వానికి నిధుల సమస్యపై వివరించారు. ఆరునెలల క్రితం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కూడా పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేలా చూడాలని కోరారు.

పూర్తి కాని భూసేకరణ..

సిర్పూరు నియోజవకర్గంలోని వివిధ ప్రాంతాలవా సులకు ఎంతగానో ఉపయోగడే కుమరం భీం ఎడమకాల్వ పనులు త్వరగా పూర్తిచేస్తే ఈ ప్రాంత రైతులు రెండు పంటలు పండించే అవకాశాలు న్నాయి. కేవలం సరైన నిధుల కేటాయించకపోవడంతో పనులు పూర్తికావడం లేదు. నిధులు విడుదలైన మేరకు పనులు చేపట్టడం ఆ తర్వాత వదిలేయటం పరిపాటిగా మారింది. ఈ కాల్వల నిర్మాణం పూర్తి కావలంటే ఇంకా రూ.50కోట్ల నిధులు అవసరం ఉంది. అలాగే 100ఎకరాల భూ సమస్య కూడా క్లియరెన్స్ కావాల్సి ఉంది. దీంతో ఇప్పటికీ ఈ కాల్వల నిర్మాణ దశవీడడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు వెంటనే స్పందించి ఈ ప్రాజెక్టు తాలుకూ ఎడమ కాల్వ పనులు త్వరగా పూర్తి చేస్తే ఎంతో మేలు జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు.

కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయడం లేదు..

-లెండుగురే శ్యాంరావు,
బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి



రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు కాల్వ నిర్మాణం పూర్తి చేయడంపై పూర్తి శ్రద్ధ చూపడం లేదు. నిధులు కేటాయించడం లేదు. రైతులు ఇప్పటికీ వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. కుమరం భీం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉన్నప్పటికీ ఈ ప్రాంతరైతులు ఉపయోగించుకునే పరిస్థితి లేదు. పూర్తిస్థాయిలో ప్రధానకాల్వలతోపాటు పిల్లలకాల్వలు కూడా చేపడితే అన్ని సమస్యలు దూరమవుతాయి.

ఎదురుచూపులు తప్పడం లేదు..

-గుళ్లపల్లి ఆనంద్,
టీడీపీ ఉమ్మడిజిల్లా పార్లమెంటు కన్వీనర్



సిర్పూరు నియోజకవర్గ రైతులకు ఎంతగానో ఉపయోగపడే కుమరం భీం ప్రాజెక్టు ఎడమ కాల్వల పనులు ఏళ్లుగా అసంపూర్తి దను వీడడం లేదు. ప్రభుత్వ నిధులు కేటాయించకపోవడమే ప్రధాన కారణం. కాల్వ నిర్మాణం పూర్తయితే రైతు ఏటా రెండు పంటలు పండించుకునే అవకాశాలున్నాయి. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి ప్రాజెక్టు ఎడమకాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి.

మాస్కులు పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాదుతున్న పీసీసీఎఫ్ ఏలు సింగ్ మేరు

సిర్పూర్(టి), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పత్తి ఏరివేతకు, అటవీప్రాంతానికి వెళ్లే సమయంలో గుంపులుగా వెళుతూ తల వెనక భాగంలో మాస్కులు ధరించి జాగ్రత్తగా ఉండాలని పీసీసీఎఫ్(ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) ఏలు సింగ్ మేరు అన్నారు. సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ పంట చేనులో పులి దాడి చేసిన సంఘటన స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం పులి అడుగులను పరిశీలించి ఇటిక్యాలపహాడ్ గ్రామంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులులు సంతానోత్పత్తి కోసం అటవీప్రాంతంలో తిరుగుతున్నాయన్నారు. రెండురోజుల క్రితం కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌లో మహిళ మృతికి కారణమైన పులే, సిర్పూర్(టి) మండలంలో సురేష్‌పై దాడిచేసినట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పులుల సంరక్షణ కారిడార్ మ్యాప్‌లద్వారా పులిఎటు వైపువెళ్లిందని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆడ,మగ పులులు కలుస్తున్నాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రౌతు సురేష్‌ను ప్రభుత్వ పరంగా అన్నివిధాల చికిత్స అందిస్తామన్నారు. ఆయన వెంట ఎఫ్‌డీపీపీ శాంతరావు, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రెవాల్, ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్, డిప్యూటీ ఎఫ్ఆర్వో చారి, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచిన ఉమ్మడిజిల్లా జట్టు



రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్‌బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఆదివారం మహబూబ్‌నగర్ జట్టుతో జరిగిన జిల్లాజట్టు 21-14గోల్స్ తేడాతో గెలుపొందింది. విజేతలను అసోసియేషన్ సభ్యులు శ్యాంసుందర్‌రావు, రమేష్, డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, కోచ్‌లు అరవింద్, సాయి అభినందించారు.

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

బెజ్జూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పులిదాడిలో మృతిచెందిన మహిళ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గోండ్వాన జిల్లాఅధ్యక్షుడు సోయం చిన్నయ్య డిమాండ్‌చేశారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ పులిదాడిలో మహిళమృతికి ఎమ్మెల్యేహరీష్‌బాబు బాధ్యతవహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధుకర్, తిరుపతి, సకారాం, సతీష్, సాయికృష్ణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి అవార్డు ప్రదానం

దహెగాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలలో పౌరశాస్త్రం బోధిస్తున్న అధ్యాపకుడు ఎన్ చంద్రశేఖర్ ఆదివారం సికింద్రాబాద్ చిక్కడపల్లిలోని ఆర్ట్‌ఆఫ్ లెర్నింగ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో జ్ఞానసంది ఉత్తమ ఆదర్శఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బోధనతోపాటు సాహిత్య, ఆధ్యాత్మికసేవలకు గుర్తింపుగా అధ్యాపకుడికి అవార్డు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామారావు, డా.వంశీ, రామరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషిచేస్తానని మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌గౌడ్, నారాయణ, నర్సింహులు, సుగుణాకర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చింతలమానేపల్లి/కౌటాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని చింతలమానేపల్లి, కౌటాలలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలనుంచి ఎంచుకున్న విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో జయరాజు, ఎంపీవో సుధాకర్‌రెడ్డి పాల్గొని విద్యార్థులు చక్కగా వ్యాసరచన పోటీల్లో పాల్గొనడంపై అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులుప్రదానం చేశారు.

మహిళ అదృశ్యం.. ఒకరిపై కేసు నమోదు

జైనూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌జిల్లాలోని ఖానూర్ మండల పరిధిలో గలపోచంపెల్లి గ్రామానికి చెందిన లక్ష్మి(41) అనే మహిళ కడబడకుండా పోయిన సంఘటన జైనూరు పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పోచంపెల్లి గ్రామానికి చెందిన గడ్డం ఎల్లవ్వ, గడ్డం లక్ష్మి తల్లీ కూతుర్లు. ఇద్దరూ జ్యోతిష్యం చెప్పడానికి 15రోజుల క్రితం మండలానికి వచ్చారు. జైనూరుకుచెందిన మండలి రాజు అప్పుడప్పుడు లక్ష్మితో మాట్లాడుతుండేవాడు. గమనించిన తల్లి రాజును పలుమార్లు హెచ్చరించింది. రోజు ప్రకారం గతనెల 29న తల్లి గడ్డం ఎల్లవ్వ పంచాంగం చెప్పడానికి వేరే గ్రామానికి వెళ్లింది. తల్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి కూతురు కనిపించలేదు. చుట్టు పక్కల బంధువులకు సమాచారం అందించిన ఆచూకీ లభించలేదు. మండలి రాజు సైతం కనడకపోవడంతో అతనిపై అనుమానం ఉందని స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి

- 2కే రన్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే



2కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసి కోల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడుతాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ప్రజాపాలన ఏడాది అయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు సీఎంకప్ పోటీల సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం 2కేరన్ పోటీలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా కలెక్టర్ వెంకటేష్‌దోత్రే హాజరై జెండాఊపి ప్రారంభించారు. ఈ రన్ కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించారు. 2కేరన్‌లో కలెక్టర్.. అధికారులు, యువతతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్న నేపథ్యంలో డిసెంబరు1నుంచి 9వరకు ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలను ప్రభుత్వం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 2కేరన్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో రమాదేవి, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, యువకులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యారంగ అభివృద్ధి దిశగా చర్యలు..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో విద్యారంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల కేజీబీవీ విద్యాలయంలో ప్రజాపాలన ప్రజావిజయోత్సవాలలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన సంవత్సర కాలంలో అమ్మ ఆదర్శ పాఠశాలకమిటీ ద్వారా ప్రభుత్వపాఠశాలలో విద్యార్థుల కొరకు మౌలిక సదుపాయాలు కల్పించామని, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు అందించామని తెలిపారు. 281మంది ఉపాధ్యాయులను నియమించామని తెలిపారు. 340మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పాఠశాలకు ఆహార భద్రత కమిటీలని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎంఈవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా, ఆదివారం ఎడ్యుకేషన్ డే కూడా కావడంతో కేజీబీవీలో ఆసిఫాబాద్ మండలస్థాయిలో మండల విద్యాధికారి రాథోడ్ సుభాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా వచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులకు విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎయిడ్స్‌కు చికిత్స లేదు.. నివారణ ఒక్కటే మార్గం



ఆసిఫాబాద్‌లో ఆస్పత్రి ఎదుట వైద్య సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌కు చికిత్సలేదని నివారణ ఒక్కటేమార్గమని జిల్లావైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్‌సీతారాం నాయక్ అన్నారు. ఆదివారం ప్రపంచఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఆసుపత్రి నుంచి అంబేద్కర్ చౌక్‌వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాంనాయక్, వైద్యులుఅజీం,అజ్మత్,మహేష్,సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరు: ఎయిడ్స్‌రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని డాక్టర్ అవినాష్ అన్నారు. ఆదివారం ప్రపంచఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండలకేంద్రంలోర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది ఫాతిమా బేగం, రాజవర్ధన్, ఆయేషా, సుస్మిత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చింతలమానేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో జరిగిన అండర్-14లో నెట్‌బాల్‌పోటీల్లో మండలానికిచెందిన జడ్పీఉన్నత పాఠశాలకుచెందిన అయాన్, బన్నీ ప్రతిభచాటి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు పీడీహరీష్ తెలిపారు. ఈనెల6,7,8తేదీల్లో కరీంనగర్‌లో జరిగేరాష్ట్రస్థాయిపోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో జయరాజు అభినందించారు.

కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ ఆగం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ ఆగమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి ముస్తాఫాతో కలిసి ఆదివారం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వంటగదితోపాటు భోజనం, కూర పరిశీలించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యాసంస్థలను భ్రష్టు పట్టిస్తున్నా రని ఆరోపించారు. పేద విద్యార్థులను గాలికి వదిలారని ఆరోపిం చారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, సాయిశ్రావన్, శ్రీకాంత్, తాజ్, అరుణ్, ప్రవీణ్, రాంశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల మండలాధ్యక్షుడిగా చౌదరి హరి

చింతమానేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండల ఆర్ఎంపీ,పీఎంపీల మండల మండలాధ్యక్షుడిగా చౌదరి హరిని ఎన్నుకున్నారు. ఆదివారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సంఘం నాయకులు అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించగా సమీన ప్రత్యర్థి జునుగరి శేఖర్‌పై 14ఓట్ల మెజార్టీతో హరి గెలుపొందారు. నూతన అధ్యక్షుడిని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మేకల మందపై పులి దాడి



మృతి చెందిన మేక

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం దానాపూర్ గ్రామసమీపంలో మేకల మందపై పులిదాడి చేసింది. మేకల కాపరి పులివచ్చినట్లు గమనించగానే గ్రామంలోకి పరుగులు తీసి గ్రామస్థులకు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లిచూడగా ఎనిమిది మేకలకుగాను ఒకమేక చనిపోయి ఉందని రేంజ్ అధికారి గోవింద్‌సింగ్ సర్దార్ తెలిపారు. కాగా పులి ఆచూకీ కోసం నాలుగు గంటలపాటు గాలించినా స్పష్టత రాలేదు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్, బీట్ అధికారి రాజేష్, సాధిక్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ధరోగపల్లిలో గేదెపై..

పెంచికలపేట: మండలంలోని ధరోగపల్లికి చెందిన వరిమడ్ల శ్రీనివాస్‌కు చెందిన గేదెపై ఆదివారం పులిదాడి చేసి చంపివేసింది. బాధితుడు తెలిపిన వివరాలప్రకారం.. రోజులుగానే గేదెను అటవీప్రాంతానికి పశువుల కాపరి తీసుకెళ్లగా గేదెలపై ఒక్కసారిగా పులిదాడి చేసింది. పశువుల కాపరులు బిగ్గరగా అరుస్తూ కేకలు వేయడంతో సమీప అటవీప్రాంతంలోకి పులి పారిపోయింది. దీంతో ధరోగపల్లి, చెడ్వాయి, జైహింద్‌పూర్, కొండపల్లి,లోడ్‌పల్లి,పోతెపల్లి,బొంబాయిగూడ, కమ్మర్‌పల్లి, గుండెపల్లి, ఎల్లూరు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

పశువుల వ్యాన్ పట్టివేత

లింగాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో ఆదివారం లింగాపూర్ పోలీసులు పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకు న్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో జైనూర్ గ్రామానికి చెందిన షేక్ ఫరుఖ్, ఏల్లాపటార్ గ్రామానికి చెందిన గోర్లేకిషన్ ఇద్దరు కలిసి పికప్‌వాహనంలో(ఏపీ 23-వాయ్3601) ఎలాంటి అనుమతులు లేకుండా మూడు పశువులను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమెదు చేశామన్నారు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు

దహెగాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా మబ్బులు పట్టిన వాతావరణం అన్నదాతల్లో గుబులు పుట్టిస్తోంది. పత్తి, వరిపంటలు చేతికి అందివచ్చే సమయంలో వరుణుడు ప్రకోపిస్తాడే మోనని రైతులు ఆందోళన చెందుతున్నాడు. రెండు రోజులుగా ఒకటి రెండు చోట్ల చినుకులు పడ్డాయి. రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పాలీన్ కవర్లతో కప్పి జాగ్రత్తపడుతున్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

చింతలమానేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవోజయరాజు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదులు, స్టాక్‌రూం పరిశీలించారు.

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌపన్‌గూడ, బండకాస, దాబా, ఖానాపూర్ అటవీప్రాంతాల్లో పులి సంచారం ఉన్నందున ప్రజలు వణికిపోతున్నారు. ఆదివారం దాబా గ్రామ ప్రాంతంలో పులి అయిదు పశువులపై దాడిచేసి గాయపరిచిన విషయం తెలిసిందే. దీంతో అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్ సూచించారు. దాబా, బండ కాస, చౌపన్‌గూడ, ఖానాపూర్, గోయగాం అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం5, తెల్లవారు 6 లోపు ఎవరూ ఒంటరిగా తిరగవద్దని హెచ్చరించారు.

మహిళలకు వంటల పోటీలు



మాట్లాడుతున్న కమిషనర్ ఉదయ్‌బాబు

సిర్పూర్(టి), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్, ఇండియన్‌గ్యాస్, భారత్‌గ్యాస్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను విద్యాశాఖ పరీక్షల కమిషనర్ ఉదయ్‌బాబు పాల్గొని పోటీలను పరిశీలించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో నాగసుధ, హెచ్‌పీ ఏజెన్సీ డీలర్ ఖుర్షిద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల ఆశలను అడియాశలు చేసిన గుర్తింపు సంఘం

మందమర్రి టౌన్, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల ఆశలను గుర్తింపుసంఘం అడియాశలు చేసిందని సీఐటీయూబ్రాంచి అధ్యక్ష కార్యదర్శి వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కార్పొరేట్ స్థాయిలో జరిగిన సమావేశంలో కార్మికులకు సంబంధించి పలుఅంశాలపై యాజమాన్యంతో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత గుర్తింపుసంఘంపై ఉందన్నారు. చలి కాలంలో స్వెటర్లు అరకొరగా ఇవ్వడం దారుణమన్నారు. కార్మికుల సమస్యల సాధనకోసం తమయూనియన్ పోరుబాట చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రమేష్, సంజీవ్, ఆదర్శ్ పాల్గొన్నారు.

ఏళ్ల సమస్యలకు ఒక్క సమావేశంతో పరిష్కారం

శ్రీరాంపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి ఉద్యోగుల సమస్యలకు నవంబరు 28న జరిగిన స్ట్రక్చరల్ సమావేశంతో పరిషారం చూపామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిస్మిసల్ అయిన జేఎంఈటీలను తిరిగి తీసుకునేవిధంగా యాజమాన్యాన్ని ఒప్పించామన్నారు. అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే మైనింగ్‌స్టాఫ్ మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయితే వారికి సర్ఫేస్‌పై సూటబుల్ జాబ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఓసీపీ, సీహెచ్‌పీలను వేరు చేసి ఉద్యోగులకు ఇన్సెంటివ్ ఇవ్వనున్నారని, వేజ్‌బోర్డులో లేని 11 అలవెన్సులను ఇప్పించేందుకు కృషిచేశామన్నారు. క్యాంటీన్లు కంపెనీయే నిర్వహిస్తుందని, ఒక్కోఉద్యోగికి అయ్యేఖర్చును పెంచుతామని తెలిపారన్నారు. ఇతర సమస్యలు సైతం ఈ నెలలో సీఎండీతో జరిగే స్ట్రక్చరల్ సమావేశంలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. తాము సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే అవగాహన లేని సంఘాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో యూనియన్ ఉపప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, పిట్‌కార్యదర్శులు నర్సింగారావు, మురళీచౌదరి, రాంచందర్, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి కార్యదర్శి వంగరి రాజేశ్వర్ రావు, కాంట్రాక్టు కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.